AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

బీసీల హక్కులను సాధించేవరకు పోరాటం

2

2

ప్రారంభమైన రోడ్డు మరమ్మతులు

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరటుడే, భీమ్‌గల్: పట్టణంలోని నందిగల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ శివ సాయి నర్సయ్య శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో రవి, భీమ్‌గల్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, తోట సతీశ్, వాకా మహేశ్, డైరెక్టర్లు స్వామి, రాజు, లింబాద్రి, బాల య్య మాజీ కౌన్సిలర్ లింబాద్రి, దశగౌడ్, పాపారాయుడు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద..

అక్షరటుడే, మెండోరా: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో శుక్రవారం సాయంత్రం 21 గేట్లు తెరిచి గోదావరి లోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 75,394 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1090.90 అడుగులకు (80.053 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీటి విడుదలను అధికారులు కొనసాగిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిజాంసాగర్‌లోకి వరద..

అక్షరటుడే, ఎల్లారెడ్డి : నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 75,394 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్‌కు వరద వస్తుండడంతో వరద గేట్ల ద్వారా 40,680 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1405.00 అడుగుల (17.8 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి ప్రస్తుతం 1182 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 25.645 టీఎంసీల నుంచి ప్రాజెక్టులోకి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

స.హ. చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

అక్షరటుడే, కామారెడ్డి: సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్టీఐ-2005 వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఐ చట్టం అమలు, మార్గదర్శకాల ప్రకారం అమలు చేస్తామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. స.హ. చట్టం వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలు, చట్టం అమలు తీరు, అందులో ఉన్న అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు స.హ. చట్టం తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం లక్ష్యాన్ని నెరవేర్చేలా పనిచేయాలన్నారు. అన్ని కార్యాలయాల పీఐవోలు ప్రజలు అడిగిన సమాచారాన్ని ఎలాంటి దాపరికం లేకుండా నిర్ణీత సమయంలో అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, డీఆర్‌వో మధు మోహన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, సెక్షన్ ఆఫీసర్స్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పీఐవోలు పాల్గొన్నారు.



పల్లె ఖజానాకు గండి

■ రూ.2.85 కోట్ల సొమ్ముకు లెక్కల్లేవు ■ సొంతానికి వాడుకున్న పలువురు సర్పంచులు ■ చర్యలు చేపట్టని అధికారులు

> పంచాయతీల్లో నిధులు భారీగా దుర్వినియోగం అవుతున్నాయి. గతంలో కొందరు సర్పంచులు నిబంధనలకు విరుద్ధంగా ప్రజల సొమ్మును ఖర్చు చేశారు. పంచాయతీ నిధులను దారి మళ్లించి సొంతానికి వాడుకున్నారు. ఈ మేరకు ఆడిట్ శాఖ అధికారులు లెక్క తేల్చి ఆ సొమ్మును ఖజానాలో జమ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇప్పటి వరకు పంచాయతీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.85 కోట్లకు లెక్కలు లేకుండా పోయాయి. - అక్షరటుడే, భీమ్‌గల్

గ్రామ పంచాయతీ పాలకవర్గాలు సక్రమంగా పని చేస్తే ప్రజలకు రోడ్లు, మురికి కాల్వలు తదితర మౌలిక సదుపాయాలు సమకూరుతాయి. కానీ కొంతమంది సర్పంచులు ప్రజల సొమ్మును అప్పనంగా కాజేశారు. ప్రతి ఏడాది జిల్లా ఆడిట్ శాఖ మే నెల నుంచి పంచాయతీలలో ఆడిట్ నిర్వహించి డిసెంబర్‌లో గ్రామపంచాయతీల వారీగా అభ్యంతరాలు, దుర్వినియోగమైన నిధులు తదితర వివరాలను పొందుపరుస్తూ సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తుంది. అయితే 60 రోజులలో సరైన బిల్లులు చూపించకపోతే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికలు ఇంకా సిద్ధం కాలేదు. అయితే 2023-24 ఆడిట్ నివేదిక ప్రకారం దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయాలని ఆదేశించినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రికవరీ చేయని అధికారులు

జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామపంచాయతీ పరిధిలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.1.38 లక్షల అవినీతి జరిగినా ఇంతవరకు రికవరీ జరగలేదు. 2014-15 నుంచి ఇప్పటివరకు ఈ గ్రామంలో రూ.28.03 లక్షల అవినీతి జరిగింది. జిల్లాలో ఈ ఒక్క గ్రామపంచాయతీలోనే కాదు జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామపంచాయతీలలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. గ్రామసభ తీర్మానం లేకుండా పనులు చేయడం, వసూలైన పన్నులను సొంతానికి వాడుకోవడం, పనులు జరగకుండా ఎంబీ రికార్డులు రాసి బిల్లులు తీసుకోవడం చేశారు. అలాగే ఆరంభ, ముగింపు నిల్వలకు భారీ వ్యత్యాసాలు ఉండడం, గ్రంథాలయ పన్ను కట్టకపోవడం, కరెంట్ బిల్లుల రికార్డులు ఆడిట్ శాఖకు చూపెట్టకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేయడం తదితర లోపాలు ఆడిట్ శాఖ పరిశీలనలో తేటతెల్లమయ్యాయి. భారీగా అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. సర్పంచుల అవినీతిపై ఫిర్యాదు కోసం అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని 13వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినా.. ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

జిల్లాలో 2023-/24 జీపీల ఆడిట్ వివరాలు

గ్రామ పంచాయతీలు	530
వచ్చిన అభ్యంతరాల సంఖ్య	4,746
దుర్వినియోగమైన నిధులు	రూ.2,85కోట్లు
నోటీసులు జారీ చేసిన జీపీలు	99

అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

చాలా గ్రామాల్లో అక్రమాలు జరిగిన అవినీతి సొమ్మును రికవరీ చేసేవారు లేరు. అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే అవినీతి జరిగినప్పుడు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే గ్రామ పంచాయతీలకు వచ్చే నిధుల వివరాలు పౌరులకు తెలిసేలా ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– మహేందర్ గౌడ్, స.హ. చట్టం రక్షణ వేదిక ప్రతినిధి

కేటీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు..

అక్షరటుడే, ఆర్మూర్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులను బీఆర్ఎస్ జిల్లా నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కేటీఆర్, హరీష్‌రావులను కలిసిన వారిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ దంపతులు తదితరులు ఉన్నారు.

మానసిక ఆరోగ్యమే మనిషికి మహాబలం

అక్షరటుడే, ఇందూరు: మానసిక ఆరోగ్యమే మనిషికి మహాబలమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ధర్మాబాయి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఖిల్లీవాడిలో డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజువారి దినచర్యలో వ్యాయామం చేస్తూ.. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రధానంగా మద్యపానం, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ జాజు, సభ్యులు సతీష్ షా, రామకృష్ణ, రత్నాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించండి

అక్షరటుడే, బాన్సువాడ: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను రాష్ట్ర రైస్ మిల్లర్స్ సంఘ ప్రతినిధులు శుక్రవారం కలిశారు. మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మిల్లర్ల తరఫున ప్రభుత్వం అమలు చేస్తున్న బియ్యం సేకరణ విధానం, చెల్లింపుల్లో జాప్యం, ల్యాబ్ టెస్టింగ్ విధానం, గన్నీ బస్తాల కొరత, మిల్లర్లపై విధిస్తున్న జరిమానాలు, రవాణా సమస్యలు వంటి పలు అంశాలను ప్రతినిధులు వివరించారు. రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వీరేశం, కిష్టయ్య, కామారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షుడు, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ కమ్మ సత్యనారాయణతో పాటు వివిధ జిల్లాల రైస్ మిల్లర్స్ నాయకులు పాల్గొన్నారు. మిల్లర్ల సమస్యలు విన్న కమిషనర్ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలికల జూనియర్ కళాశాల తనిఖీ

అక్షరటుడే, ఇందూరు: కోటగల్లీలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, శానిటేషన్ పనులు, గదుల మరమ్మతులు తదితర పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సీఎస్ఐ, సుభాష్ నగర్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపార్, యూడైస్‌ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

రూరల్ ఎమ్మెల్యే మాతృమూర్తికి సీఎం నివాళులు

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి దశదిన కర్మ కార్యక్రమానికి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆమె ఫొటోకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంటనే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్ తదితరులున్నారు. -అక్షరటుడే, ఇందూరు

ముగ్గురు బాలికల ఆచూకీ లభ్యం

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని కోటగల్లి పాఠశాల లో గల ఎస్సీ వసతి గృహం నుంచి అదృశ్యమైన ముగ్గురు బాలికల ఆచూకీ లభ్యమైంది. ఇద్దరు విద్యార్థినులు హైదరాబాద్‌లో, ఒక బాలిక ఆచూకీ నాందేడ్‌లో లభ్యమైనట్లు తెలిసింది. ఈ విషయమై ఇప్పటికే తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు సమాచారం. విద్యార్థులను నిజామాబాద్‌కు తీసుకు వచ్చినట్లు సమాచారం. కాగా.. హాస్టల్ లో ఉన్న పదో తరగతికి చెందిన ఇద్దరు, తొమ్మిదో తరగతికి చెందిన ఓ విద్యార్థిని వసతి గృహం నుంచి బయటకు వెళ్లి పోయిన విషయం తెలిసిందే. హాస్టల్ సిబ్బంది పోలీసులకు, విద్యార్థుల తల్లి దండ్రులకు సమాచారం అందించగా.. పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలికల ఆచూకీని గుర్తించారు.

ఆర్వోబీల పనులను త్వరగా పూర్తిచేయాలి

అక్షరటుడే, ఇందూరు : జిల్లాలోని ఆర్వోబీల పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నిజామాబాద్‌కు రావడంతో కలెక్టరేట్‌కు చేరుకున్న ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేస్ కులాచారి, నాయకులు కింద కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మాధవనగర్, అడవి మామిడిపల్లి, అర్సపల్లి ఆర్వోబీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు. సీఎంను కలిసి సమస్యలు చెప్పాలనుకుంటే అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం అనుమతించడంతో వారు వెళ్లి సీఎంకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు.

నిఖిల్ సాయి చౌరస్తాలోనూ..

జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి నిఖిల్ సాయి చౌరస్తాలో నిరసన తెలపడానికి వెళ్లిన బీజేపీ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో పోలీసులు, నాయకులకు తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ ఆర్వోబీల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు.

ఆలూర్‌లో మాలమహానాడు నాయకుల సమావేశం

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలో మాలమహానాడు మండలాధ్యక్షుడు అగ్గు క్రాంతి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లోని శ్రీరామగార్డెన్‌లో జరగనున్న సమావేశంలో ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్లలో మాల వర్గం ఎదుర్కొంటున్న అన్యాయాలు వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అగ్గు క్రాంతి మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, చిట్టిబాబు, పిట్ల శోభన్, శ్రీనివాస్, గంగాధర్, సజన్, మహిపాల్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక

అక్షరటుడే,ఎల్లారెడ్డి: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాల ఎల్లారెడ్డికి చెందిన నలుగురు విద్యార్థులు వాలీబాల్ జట్టుకు ఎంపిక య్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ రఫత్ వివరాలు వెల్లడించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఈ నలుగురు విద్యార్థులు చక్కటి ప్రదర్శన చూపారన్నారు. అక్రమ్ అండర్-14 విభాగంలో ఎంపికవ్వగా.. షేక్ అయాన్, ప్రణదీప్ గౌడ్, మహమ్మద్ అనాస్‌లు అండర్-17 విభాగంలో ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులతో పాటు పీఈటీ జ్ఞానేశ్వర్‌ను ప్రిన్సిపల్ రఫత్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజ్, మంజూర్ ఖాన్, ప్రవీణ్ కుమార్ దత్తాత్రేయ, నాగరాజు పాల్గొన్నారు.



సామాజిక మాధ్యమాలకు బానిసలు కావద్దు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక కళాశాలలో శుక్రవారం 'నేటి యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయికి పంపుతున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్చంద్రకాంత్, టీఎస్ కేసీ ఇన్‌ఛార్జి శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన రోడ్డు మరమ్మతు పనులు

అక్షరటుడే, భీమ్‌గల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న భీమ్‌గల్ నుండి బడా భీమ్‌గల్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క చొరవతో పనులు ప్రారంభమైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్, దేవేందర్, వాక మహేష్, సర్వ సమాజ్ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడు గంగా మొహన్, గంగారపు లింబాద్రి, జలంధర్, షాదుల్లా పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు మృతి..

బంగారం కొనుగోలు చేసిన వ్యక్తికి శిక్ష

అక్షరటుడే, కామారెడ్డి: ఓ మహిళ మెడలో గొలుసు చోరీ చేసి వ్యాపారికి అమ్మిన నిందితుడు మృతి చెందగా.. కొనుగోలు చేసిన వ్యక్తికి కోర్టు శిక్ష విధించింది. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2020 జులై 17న బిచ్కుందకు చెందిన ఈడెం పోచవ్వ తన ఇంటి నుంచి మధ్యాహ్నం సమయంలో మార్కెట్‌కు బయలుదేరింది. బిచ్కుందలోని మెయిన్ రోడ్డులో ఓ దుండగుడు మీకు పింఛన్ డబ్బులు వచ్చాయి. బ్యాంకు అకౌంట్లో పడ్డాయని మాయమాటలు చెప్పి పక్కనున్న సందులోకి తీసుకెళ్లి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి కుమారుడు బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పెద్ద ఎడ్గి గ్రామానికి చెందిన వాగ్మారే దిగంబర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన బంగారు గొలుసును పెద్ద ఎడ్గికి చెందిన తుకారాంనకు అమ్మినట్లు తెలిపాడు. దాంతో తుకారంను కూడా అరెస్ట్ చేశారు. కేసులో సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి ప్రధాన నిందితుడు దిగంబర్ మృతి చెందడంతో.. దొంగ సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి తుకారాంనకు బిచ్కుంద కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ. 3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బీసీల హక్కులను సాధించేవరకు పోరాటం

నగరంలో ఆందోళన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సీపీఐ ఆధ్వర్యంలో..

అక్షరటుడే, ఇందూరు: బీసీల హక్కులను సాధించేవరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్ గార్డెన్ చౌరస్తాలో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతి నాయకులు హైకోర్టులో పిటిషన్ వేయడం సిగ్గుచేటన్నారు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న న్యాయమైన హక్కులను సాధించే దిశగా అడుగులు వేస్తే అడ్డుపడడం తగదన్నారు. బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాకిషన్, రాష్ట్ర నాయకుడు ప్రసాద్, సాయిరాజ్, విజయ్ కుమార్, అజయ్, విజయ్, శ్రీలత, రుక్మిణి, జయ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీ కాలయాపన చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ కట్టుబడి ఉందని మాట్లాడుతూనే.. మరోవైపు కోర్టులో కేసులు వేయిస్తూ కేంద్రంలో బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటూ డ్రామాలాడుతుందని విమర్శించారు. బీజేపీకి బీసీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బిల్లుకు తక్షణం ఆమోదం తెలిపి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన కుంటుపడిందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా బీసీలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు హనుమాన్లు, రఘురాం, అంజలి, రాధా కుమార్, ప్రసాద్, గోవర్ధన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన వినయ్ రెడ్డి

అక్షరటుడే, ఆర్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈమేర కు కలెక్టర్ గ్రౌండ్‌లో హెలిపాడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోనల్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కమల, ఫిజికల్ డైరెక్టర్లు ధర్మేందర్, సత్యం, వివిధ మండలాల ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు నాగనాథ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కేజీబీవీ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎనుగుల దయానంద్ రెడ్డి వివిధ సామాగ్రి అందజేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఎస్వో గరిగె భవానికి ప్రయోగశాల పరికరాలు, ఛార్జర్లు, మెడికల్ కిట్లు, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు, ఇతర వస్తువులు అందించారు.

దృఢంగా ఉంటేనే క్రీడల్లో రాణించొచ్చు

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉంటేనే క్రీడల్లో రాణించవచ్చని కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రి నోడల్ ఆఫీసర్ పద్మలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి సందర్భంలో అయినా మానసిక ధైర్యాన్ని కోల్పోవద్దని, పరీక్ష సమయంలో ఏకాగ్రతతో చదవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధు, రాజ్ కుమార్, వైష్ణవి, గంగాధర్, మురళీకృష్ణ, స్వాతి, స్రవంతి, ఏఎన్ఎంలు కృష్ణవేణి, స్వరూప, ఆశ వర్కర్లు హారిక, శోభ, స్వరూప పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ జట్ల ఎంపిక

అక్షరటుడే బాల్కొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగబోయే జిల్లాస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు బాల్కొండ జోన్ బాలబాలికల జట్ల ఎంపిక పూర్తయింది. ఈ ఎంపికలు మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో నిర్వహించినట్లు ఎంపీడీవో బొట్టు రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ జట్లు సోమవారం జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో జరిగే జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొంటుందని వారు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో బాల్కొండ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రశాంత్ కుమార్, పీడీ రాజ్‌కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్ కుమార్, గోపి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : సోయా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ పెద్దకొడప్‌గల్ గ్రామ అధ్యక్షుడు కుమార్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహశీల్దార్ అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు నష్టపోయాయన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సోయా పంట కోతకు రావడంతో ముందస్తుగానే సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. సోయా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ మండల కార్యదర్శి బోడి రాజు యాదవ్, ఉపాధ్యక్షుడు జైత్రం, బాన్సువాడ డివిజన్ కిసాన్ సంఘం సభ్యులు దేవిసింగ్, రైతులు కృష్ణ జోషి శర్మ, విఠల్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అక్షరటుడే, ధర్పల్లి: జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో లిటిల్ హార్ట్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బీఏ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అండర్-14 బాలుర జట్టులో విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్‌కే రోహణ్, ప్రవీణ్ కుమార్, బాలికల జట్టులో వీక్షిత, మహిత, దీక్షిత ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల తరపున అభినందించారు.

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే దురదృష్టకరం

అక్షరటుడే,ఆర్మూర్ : బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు రమణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించకపోయినా, గవర్నర్ బిల్లు ఆమోదించకపోయినా, సీఎం ఒంటరి పోరాటం చేశారన్నారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజర్వేషన్లు కల్పించామన్నారు. హైకోర్టు స్టేతో బీసీలు పూర్తిగా నిరాశలో కూరుకుపోయారన్నారు. అయినా తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికైనా బీసీల ఆవేదన అర్థం చేసుకోవాలన్నారు. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తప్పని సరిగా రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన ఆర్మూర్ నేతలు

అక్షరటుడే, ఆర్మూర్: నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని పురాణిపేట్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శిరం అనుసాగర్, ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాస్, దైడి సురేష్, తోట శివక్రాంతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట, గణేశ్, తోట హరీష్, మగ్గిడి గంగాధర్, అక్కం గంగాధర్, ఒడ్డెమ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

అక్షరటుడే, ఇందూరు: బీసీ ద్రోహులకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తామని పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా బీసీ సంక్షేమ అధ్యక్షుడు నరాల సుధాకర్, సంఘం రాష్ట్ర నాయకులు సత్యప్రకాశ్, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యేవరకు పోరాటం ఆపేది లేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఎవరు అడ్డు వచ్చినా.. బీసీల హక్కులు సాధించుకునేవరకు పోరాటం చేస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

నూతన నీటి ట్యాంకును నిర్మించాలి

అక్షరటుడే, బాన్సువాడ: పట్టణంలోని సంగమేశ్వర కాలనీ చౌరస్తాలో శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకును తొలగించాలని కాలనీవాసులు కోరారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వెళ్లే రోడ్డు పక్కనే ట్యాంకు ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంకును తక్షణమే కూల్చివేసి, కొత్త ట్యాంకు నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణాల గంగారెడ్డి, జిల్లా కౌన్సిలింగ్ సభ్యుడు ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షుడు అనిల్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల రాజు, సాయి కిరణ్, హన్మాండ్లు, నాగరాజ్ పాల్గొన్నారు.